

# పసిడిమనసులు

## - షర్మిల



# సిస్టర్ ఫిలిప్పా

నేను చదివే సెయింట్ జోసెఫ్ సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ కి రోజూ మర్రిపాలెం నుంచి బస్సెక్కి కాన్వెంట్ జంక్షన్ లో దిగాలి .

స్కూల్ కి ఒక్క నిమిషం లేటైనా మా హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ ఫిలిప్పా బెత్తానికి పని చెప్తుంది.

సిస్టర్ ఫిలిప్పా మళయాళీ. ఐదడుగుల ఎత్తు, కాస్త తెల్లగా పైనుంచి కిందకి తెల్లటి గౌన్, మెళ్లో వేలాడే సిలువ, చేతిలో ఎల్లవేళలా వుండే బెత్తం.

యముడి చేతిలో పాశం లాగా సిస్టర్ ఫిలిప్పా చేతుల్లో ఆ బెత్తం వుండాల్సిందే. పైగా ఆ కళ్లు చూస్తే చాలు నాకైతే చచ్చే భయం.

అలాగని మిడిగుడ్లేం కాదు. మామూలు కళ్లే ! కానీ కాల్చేసేలా ఆమె చూసే చూపుకే మాకు వణుకు పుట్టేది.

మళయాళీ యాసలో " ఏయ్ పిళ్ళా స్పెషళ్ క్లాస్ ఈవెణింగ్ వుందని మిగతా పిళ్ళలికి చెప్పు " ఇట్లా వుండేది అవిడ భాష.

ప్రేయర్ లో రోజూ కాసేపు మాకు నీతి బోధలు చేసేది . "మీకు బుద్ధియ రావాళని ఈ రోజు ఆపిళ్ త్యాగం చేశా" అంటూ మాకోసం ఏ మేం త్యాగం చేస్తున్నదీ చెప్పుకొచ్చేది.

ఆ రోజు ఆవిడకి ఇచ్చిన భోజనంలో ఆపిల్ తినకుండా మాకు బుద్ధిరావాలని తినడం మానేసేదన్నమాట.

సిస్టర్ ఫిలిప్పా గదిలో ఒక వాలు కుర్చీ వుండేది. అది సిక్ ప్యూపిల్ చైర్. ఎవరికైనా పిల్లలికి వంట్లో బాగోకపోతే ఆ కుర్చీలో పడుకోబెట్టేది.

మా స్కూల్లో ఎప్పుడూ ప్రేయర్ ఎండలో జరిగినప్పుడు కళ్లు తిరిగి పడిపోయిన పిల్లల్ని కాసేపు పడుకోబెట్టి పంపేది. నాకేనాడూ కళ్లు తిరిగి పడిపోయే అవకాశం రాలేదు.

ఒక్కసారి చిన్న కడుపు నెప్పి వచ్చింది. ఆ కుర్చీలో నేనూ పడుకోవాలని ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న అవకాశమయ్యే ! వెంటనే క్లాస్ టీచర్ కి చెప్పి సిస్టర్ రూం కి వెళ్లాను.

కడుపునొప్పి అని చెప్పగానే ఒక సీసా తీసి గ్లాస్ తో వాము వాటర్ పోసి తాగమంది. ఏం చేస్తాను కర్మ ! తాగేశాను, అదే ఇంట్లో అమ్మ ఇట్టాంటివి తాగమంటే చచ్చినా తాగను.

తాగాక కాసేపు కుర్చీలో కూర్చోమంది. నిశ్శబ్దంగా వున్న ఆ గదిలో వాలు కుర్చీలో ఓ పావు గంట పడుకుని కడుపు నెప్పి తగ్గిపోయిందని చెప్పి వచ్చేశాను.

సిస్టర్ ఫిలిప్పాకి ఎవరైనా ఆడతనం వుట్టిపడేలా అలంకరించుకుంటే ఎంత కోపమో.

మా స్కూల్లో బర్త్ డే రోజు యూనిఫాం వేసుకో అక్కరలేదు.ఒక టెంత్ క్లాస్ అమ్మాయి బర్త్ డేకి చీర కట్టుకు వచ్చింది. ఆ రోజు ఆ అమ్మాయిని ఏదో వంకన తిట్టి ఏడిపించింది.

ఆ అమ్మాయి బస్టాప్ లో మాతో మాట్లాడుతూ "సిస్టర్ ఫిలిప్పా ఏ రంగుల బట్టలూ వేసుకోవాలన్నా వేసుకోలేదు, తను నన్ కాబట్టి మిగతా వాళ్లు అందంగా తయారైతే ఓర్వలేదు" అంది.

నిజమే నేను పాంట్ షర్ట్ వేసికెళ్తే నవ్వుతూ చూసిన సిస్టర్ ఒక రోజు లంగా ఓణీ వేసుకుని వెళ్తే తిట్టి పోసింది అందుకేనేమో.

కానీ సిస్టర్ ఫిలిప్పా స్పెషల్ క్లాస్ లు పెట్టి చదివించినందుకో ఏమో గానీ ఇళ్ల దగ్గర పెద్దగా చదవకపోయినా మంచి మార్కులే వచ్చాయి. మేం స్కూల్ మాని వచ్చేసినా చాన్నాళ్లు ... కాదు !కాదు !! చాలా ఏళ్లు. ఏటా ఒక్కసారైనా కలలోకి సిస్టర్ ఫిలిప్పా వచ్చేది. అదీ బెత్తంతో !

నేను పిల్లతల్లినైనా ఆ కల రావడం మానలేదు. ఒక సారి మా అమ్మాయి ఎల్ కె జీ చదివే మిషనరీ స్కూల్ ఫీస్ట్ కి వెళ్లాను.

అక్కడికి వచ్చిన నన్స్ లో మా సిస్టర్ ఫిలిప్పా వుంది. ఒక్కసారిగా ఆనందం కానీ ఆమె బెత్తం దెబ్బ గుర్తొచ్చి భయం వేసింది.

బెరుకుగా వెళ్లి "సిస్టర్ !నేను మీ స్టూడెంట్ ని " అన్నాను.

నా పిల్ల ఈ స్కూల్లోనే చదువుతుందని చెప్పాను.

ఫిలిప్పా చేతులు సాచి నా బిడ్డని దగ్గరకు తీసుకుని "బాగా చదువుకో " అని ముద్దాడింది.

అదేంటో గానీ ఆనాటి నుంచి సిస్టర్ ఫిలిప్పా కలలోకి రావడం మానేసింది.

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments